





కొమ్మ కాదు.. క్యాసారం!

జోగిపేట/జోగిపేట రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో చెట్టు కొమ్మల మధ్య కనిపిస్తున్నది కరెంటు లైన్లు వేయడానికి ఉపయోగించే క్యాసారం (క్రాస్ ఆర్మ్)! జోగిపేట పట్టణంలోని బసవేశ్వర చౌక్ వద్ద ప్రధాన రహదారి పక్క నుంచి ఉన్న విద్యుత్ హైటెన్షన్ లైన్‌ను స్తంభాల పైనుంచి కాకుండా ఇలా చెట్టు కొమ్మ ఆధారంగా ఏర్పాటుచేశారు. ఒక స్తంభం మిగులుతుందని అనుకున్నారేమో.. వేప చెట్టుకు క్రాస్ ఆర్మ్, యాంగ్లర్ బిగించి హైటెన్షన్ లైన్ వేశారు. ఎన్నేళ్లయ్యిందో.. ఆ క్యాసారం చెట్టులో కలిసిపోయింది! నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఇలా నిర్లక్ష్యంగా చెట్టుకు విద్యుత్ తీగలు బిగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్షం కురిసేటప్పుడు చెట్టును ముట్టుకుంటే కరెంట్‌షాక్ వస్తున్నది, గాలి వీస్తే వైర్లకు కొమ్మలు తగిలి నిప్పురవ్వలు పడుతున్నాయని పక్కనే ఉన్న దుకాణదారులు వాపోయారు. ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

సీసీరోడ్డు పనులను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నామని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 9వ వార్డు పరిధిలో ఉన్న ఆర్టీసీ కాలనీలో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఇందుకోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారాలతో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్ కుమార్, మహేష్, కిరణ్‌గౌడ్, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి 9వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



← సంగారెడ్డి పట్టణ అభివృద్ధి గురించి వివరిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

ప్రభుత్వ పాఠశాల లేనిచోట 'ప్రైవేట్'లో ప్రవేశాలు


విద్యాహక్కు చట్టంలోని 12(1)(సి)సెక్షన్ అమలు

సంగారెడ్డి జిల్లాలో గ్లెండేల్ స్కూల్ ఎంపిక

విద్యాశాఖ ఉత్తర్వులు

సంగారెడ్డి అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడి అందుబాటులో లేనిచోట ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశాలకు అవకాశం కల్పించేలా విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు విద్యాహక్కు చట్టంలోని 12(1)(సి) సెక్షన్ అమలు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ, పట్టణాల్లోని ఆవాసాలకు కి.మీ దూరంలో ప్రభుత్వ పాఠశాల లేకపోవడం..అక్కడ 20 మంది కంటే తక్కువ మంది పిల్లలు ఉన్న నేపథ్యంలో వారికి సమీపంలోని ప్రైవేటు పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తామని ఇటీవల పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 23 గ్రామీణ, 33 పట్టణ ఆవాస ప్రాంతాలను గుర్తించిన విద్యాశాఖ.. పాఠశాలల జాబితాను విడుదల చేసింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి అంబేడ్కర్ కాలనీలోని గ్లెండేల్ ప్రైవేటు స్కూల్‌ను ఎంపిక చేసింది. ఎంపిక చేసిన పాఠశాలలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఆ ప్రాంత విద్యార్థులకు సర్కారు అవకాశం కల్పించేలా విద్యాశాఖ నిర్ణయం తీసుకుందని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

గ్రూపు రాజకీయాలతో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం నువ్వానేనా అన్నట్లుగా తయారైంది. రాష్ట్రంలో అధికారం వచ్చిన నాటి నుంచి స్థానికంగా ఉన్న నాయకులు ఉప్పు నిప్పులా చిటపటమంటున్నారు. సొంత పార్టీలో ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్నారు. ఇలాంటి తరుణంలో పార్టీ పదవుల నియామకం తెరమీదకు వచ్చింది. మే నెలలో ఆశావహులంతా బ్లాక్ ఏరియా, మండలం, పట్టణ అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తులు సమర్పించారు. ఈ క్రమంలో పదవులకు ఎవరెవరు అర్హులో నేడు తేల్చబోతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పీసీసీ ఇన్‌చార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా ఆశావహులను ఇంటర్వ్యూలు చేసి పదవులు కట్టబెట్టడానికి సిద్ధమయ్యారు. మరికాసేపట్లో గాంధీభవన్‌లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలంతా ప్రత్యక్షం కాబోతున్నారు.



అభయహస్తం ఎవరికో?

కాంగ్రెస్‌లో పదవుల పంపకం

గాంధీభవన్‌లో నేడు ఇంటర్వ్యూలు

మండల, పట్టణ, బ్లాక్ అధ్యక్షుల నియామకం

ఒక్కో పదవికి పదుల సంఖ్యలో దరఖాస్తులు

ఇంటర్వ్యూ చేయనున్న మంత్రి పొన్నం

పార్టీలోని గ్రూపుల నేతల మధ్య పోటాపోటీ

ఆశావహుల్లో ఉత్కంఠ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 13 : 2014 సంవత్సరంలో అధికారం కోల్పోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ కేడర్ నిరుత్సాహంలో మునిగింది. తలోదారి ఎంచుకోగా కొంతమంది పార్టీలోనే కొనసాగారు. 2018 ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు నిరాశ ఎదురవ్వడంతో నైరాశ్యం నిండింది. దీంతో పార్టీ పదవులు తీసుకోవాలంటేనే నాయకులు, కార్యకర్తలు తర్జనభర్జన పడ్డారు. పదవుల భారం మోయలేక కొత్తవారు ఆసక్తి చూపకపోవడంతో దశాబ్దాల కాలంగా కొనసాగుతున్నవారు ఎంతోమంది ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పరిస్థితి తారుమారైంది. చిన్నపాటి పదవికి కూడా పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. పదవులు మాకంటే మాకంటూ తమ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అక్కడ కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్

ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గజ్వేల్ నియోజకవర్గంలో మొన్నటిదాకా ఇన్‌చార్జి నర్సారెడ్డి, సీనియర్ నేత శ్రీకాంత్‌రావు మధ్య విభేదాలు నెలకొన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే భగ్గుమన్నారు. మరో సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావు సైతం ఇదే నియోజకవర్గంలో

మిగతా 7వ పేజీలో

వానాకాలం పంటకు సింగూరు జలాలు!

రెండు టీఎంసీల విడుదల.. నేడో రేపో ఉత్తర్వులు

పుల్‌కల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటకు సింగూరు ప్రాజెక్టు జలాలను విడుదల చేయడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు అంగీకారం తెలిపినట్లు తెలిసింది. కాలువల ఆధునికీకరణ పేరుతో గతేడాది వానకాలం, యాసంగి పంటల సాగుకు జలాలను విడుదల చేయలేదు. ఈసారి కూడా సాగునీటి విడుదలపై స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే సింగూరు జలాలను విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మరో రెండు మూడు రోజుల్లో వెలువడే అవకాశాలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతుండటంతో సింగూరు జలాల విడుదలకు అంగీకరించినట్లు తెలిసింది.

40వేల ఎకరాల ఆయకట్టు



సింగూరు ప్రాజెక్టు

సింగూరు ప్రాజెక్టు కింద ఉన్న 40 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రతీ ఏటా రెండు టీఎంసీల జలాలను విడుదల చేస్తారు. వానకాలం పుష్కలంగా వర్షాలు కురుస్తే 1.5 టీఎంసీల జలాలే సరిపోతాయని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు క్రాప్‌హాలిడే ప్రకటించారు. ఈసారి నీటి విడుదలపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో శనివారం సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో నియోజకవర్గంలోని మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్కల్, చౌటకూర్ మండలాలకు చెందిన నాయకులు సింగూరు జలాల విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సాగుకు జలాలను అందించాలని ఆదేశించారని పుల్కల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లన్నగారి దుర్గారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రాష్ట్ర స్థాయి అధికారులను సంప్రదించిన అనంతరం జలాలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని సింగూరు ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

వేధిస్తున్న ఎంపీడీవోల కొరత

మెదక్ జిల్లాలో తొమ్మిది మండలాల్లో ఇన్‌చార్జిలే!

స్థానిక ఎన్నికల నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం



మెదక్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక విభాగమైన మండల అభివృద్ధి అధికారుల కొరత ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంచాయితీ ఎన్నికలపై సన్నాహాలు కొనసాగుతున్నాయి. గత సంవత్సరంలో నిర్వహించాల్సిన గ్రామ పంచాయితీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు తుది ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మెదక్ జిల్లాలో అధికారుల కొరత తీవ్రంగా ఉన్నది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సమయంలో జిల్లా పంచాయితీ రాజ్ పరిపాలన వ్యవస్థలో కీలక పాత్ర పోషించే ఎంపీడీవోలు దాదాపు సగం మంది అధికారులుగా ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు.

సగం మంది ఇన్‌చార్జిలే

జిల్లాలో మొత్తం 21 మండలాలు ఉండగా.. కొత్త మండలమైన మాసాయిపేటకు ఇంకా మండల అభివృద్ధి అధికారి పోస్టు మంజూరు కాలేదు. ప్రస్తుతానికి 20 మండలాలనే పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇందులో రెగ్యులర్ ఎంపీడీవోలు 11 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన తొమ్మిది మండలాలకు ఇన్‌చార్జి అధికారులతోనే పాలన కొనసాగిస్తున్నారు. స్థానిక పరిపాలనలో కేంద్ర బిందువుగా ఎంపీడీవోలు వ్యవహరిస్తారు. వీరు మండలస్థాయిలో అభివృద్ధి, పథకాల అమలు, గ్రామ పంచాయితీ కార్యకలాపాల పర్యవేక్షణతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన పోస్టుల భర్తీలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఏళ్ల తరబడి ఇన్‌చార్జిలతోనే కాలం వెల్లదీస్తున్నది. అదనపు బాధ్యతలు నిర్వహించడం వల్ల పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఇన్‌చార్జిలతోనే పాలన

జిల్లావ్యాప్తంగా తొమ్మిది మండలాలలో రెగ్యులర్ ఎంపీడీవోలు లేక ఇతర అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మెదక్, తూప్రాన్, హవేళీఘనాపూర్, శివంపేట, చిలప్‌చేడ్, టేక్మాల్, మండలాలకు ఎంపీవో (మండల పంచాయితీ అధికారులు) ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. అల్లాదుర్గం, పాపన్నపేట, నార్సింగి మండలాల్లో సూపరింటెండెంట్లే ఎంపీడీవోల విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్త నియామకాలు ఆలస్యం కావడం, నాన్ కేడర్ ఉద్యోగులను తాత్కాలిక ఇన్‌చార్జిలుగా నియమించడంతో పాటు ఎంపీడీవో పోస్టులకు సంబంధించి గతంలో డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ సమావేశాలు సకాలంలో జరగలేదు. దీంతో అధికారుల కొరత వేధిస్తోంది. ఇక ఎన్నికల సమయంలో ఎంపీడీవోలు రిటర్నింగ్ అధికారులుగా, పోలింగ్ సిబ్బంది సమన్వయకర్తలుగా, ఓటర్ల జాబితా నవీకరణలో పాటు వివిధ పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషిస్తాంటారు. అందుకే ఎంపీడీవోల పోస్టులు భర్తీ చేయకపోతే సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రతీ మండలానికీ ఒక రెగ్యులర్ ఎంపీడీవో ఉండాల్సిందేనని అభిప్రాయ పడుతున్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ హక్కులను వినియోగించుకునే ప్రక్రియ సమర్థవంతంగా నడిపేందుకు పంచాయితీ రాజ్ వ్యవస్థలో సంస్కరణలు అవసరమేనని పేర్కొంటున్నారు.



జూనియర్ కాలేజీల్లో క్రీడలకు ప్రాధాన్యం

క్రీడా పరికరాల కొనుగోలుకు నిధులు

ఒక్కో కళాశాలకు రూ.10 వేలు మంజూరు

సంగారెడ్డి అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల పరంగా అవసరమైన సౌకర్యాల కల్పనకు ఇంటర్ బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. గత నెలలో సర్కారు జూనియర్ కళాశాలల్లో మౌళిక వసతుల కల్పనకు సంగారెడ్డి జిల్లాకు రూ.3.34 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. తాజాగా క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.2 లక్షలు నిధులు మంజూరు చేస్తూ ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య ఉత్తర్వులు వెలువరించారు. సంగారెడ్డి జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా ఒక్కో కళాశాలకు రూ.10 వేల చొప్పున క్రీడా సామగ్రి కొనుగోలుకు నిధులు మంజూరు చేశారు.


క్రీడల్లో ప్రతిభకు అవకాశం

జూనియర్ కళాశాలల్లో క్రీడా పరికరాలు లేక కొంత కాలంగా విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. సరిపడా క్రీడా పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ఎక్కడైనా క్రీడా పోటీలు జరిగితే ఇంటర్ విద్యార్థులు ప్రతిభ చూపలేక పోతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఇంటర్ బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. పేద విద్యార్థులే ఎక్కువగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆటలకు అలవాటైన వీరు కళాశాలలకు వచ్చే సరికి ఆడుకునేందుకు క్రీడా పరికారులు, ఆడిపించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు కొరత వేధిస్తోంది. ఫలితంగా కళాశాల్లోని క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారుతున్నాయి. అండర్-19 క్రీడా పోటీల్లో ఏటా ప్రభుత్వ పరంగా జరుగుతున్న వాటిల్లో సర్కారు జూనియర్ కళాశాలల విద్యార్థుల ప్రాతినిధ్యం కూడా లేకుండా పోతున్నది. ప్రభుత్వం తాజాగా జూనియర్ కళాశాలల్లో క్రీడా పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు చేయడంతో విద్యార్థులు క్రీడల్లో రాణించే అవకాశం ఉన్నదని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తెలిపారు.

352 మంది టీచర్ల సర్దుబాటు

సంగారెడ్డి జిల్లాలో పూర్తయిన ప్రక్రియ

కలెక్టర్ ఆమోదానికి ఫైలు



సంగారెడ్డి అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియ పూర్తయింది. ఈమేరకు విద్యాశాఖ అధికారులు సంబంధిత ఫైలును జిల్లా కలెక్టర్ ఆమోదానికి పంపారు. కలెక్టర్ ఆమోదం తెలిపితే ఒకట్రెండు రోజుల్లో కొత్త పాఠశాలల్లో ఉపాధ్యాయులు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

అక్కడి నుంచి ఇక్కడికి..

2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయులు లేనిచోట సర్‌ప్లస్ ఉన్న ఇతర పాఠశాల నుంచి సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం విధివిధానాలను రూపొందించింది. ఈమేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి గతేడాది విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్ల సర్దుబాటు చేయాలని, ఇందులో భాగంగా గత నెల 12వ తేదీ లోపే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని తొలుత ఆదేశాలు వచ్చాయి. కానీ, ఉపాధ్యాయల సంఘాల అభ్యంతరంతో ఉన్నతాధికారులు ఈ ప్రక్రియను నెల రోజులు వాయిదా వేశారు. అనంతరం జూలై 15 తేదీ లోపు సర్దుబాటు పూర్తిచేయాలంటూ విద్యాశాఖ తుది ఆదేశాలు జారీ చేసింది. ఎంఈవోలు ఇచ్చిన వివరాల ఆధారంగా టీచర్లను వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేశారు. సంగారెడ్డి జిల్లాలో 352 మంది ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేస్తూ తుది జాబితా రూపొందించారు. సంబంధిత ఫైలు కలెక్టర్ ఆమోదం పొందితే ఈ నెల 15వ తేదీ నుంచి ఉపాధ్యాయులు కొత్త పాఠశాల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

రేపు, ఎల్లుండి మిషన్ భగీరథ బంద్



పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్

15, 16 తేదీల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

మెదక్, నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గాల్లో నీటిసరఫరాకు ఆటంకం

మెదక్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పెద్దారెడ్డిపేట గ్రామ సమీపంలో 110 మిల్లీ మీటర్ల డయాపైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడటంతో ఉమ్మడి జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో రెండు రోజుల పాటు భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గ్రిడ్ ఈఈ నాగభూషణం తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో మరమ్మతులు చేపడుతున్నందున సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. లీకేజీలను సరిదిద్దడంతో పాటు 90 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రంలో నిర్వహణ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. దీంతో మెదక్, నారాయణ్‌ఖేడ్, అందోల్ నియోజకవర్గాల పరిధిలో కొన్ని ప్రాంతాలలో నీరు సరఫరాకు ఆటంకం కలుగుతుందని వివరించారు. ప్రజలు నేడే రెండు రోజులకు సరిపడా నీరు నిల్వ ఉంచుకోవాలని కోరారు. తిరిగి జూలై 16న మద్యాహ్నం రీటి సరఫరా ప్రారంభమవుతుందని వివరించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం మెదక్ మండల పరిధిలోని పేరూరు గ్రామంలో రైతులతో కలిసి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ నిరంతర విద్యుత్ సరఫరా ఎలా ఉన్నదని ఆరా తీశారు. యూరియా ఇతర పురుగు మందుల సరఫరా గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో యువకుడి హత్య


తాజోద్దీన్ (ఫైల్)

జహీరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణానికి చెందిన యువకుడిని ముగ్గురు కలిసి హత్య చేశారు. ఈ సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆదివారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్‌కు చెందిన తాజోద్దీన్ మంత్రాలు చేస్తున్నాడని అదే పట్టణానికి చెందిన హసన్, అక్బర్, ముక్రం అనుమానం పెంచుకున్నారు. తాజోద్దీన్ తమ ఇంటికి వచ్చి వెళ్లిన ప్రతీసారి వారి ఇళ్లలో కుటుంబసభ్యుల్లో ఎవరో ఒకరు అనారోగ్యానికి గురవుతుండడంతో అతనే కారణమని భావించి ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకున్నారు. శనివారం రాత్రి తాజోద్దీన్‌ను ముగ్గురు కలిసి నాగుల కట్ట వద్ద నుంచి తీసుకువెళ్లి మరణాయుదాలతో దాడి చేసి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని సంచిలో చుట్టి సిద్దేశ్వరమఠం సమీపంలో గల పాడుబడిన బావిలో పడేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానంతో హసన్, అక్బర్, ముక్రంను అదుపులోకి తీసుకుని విచారించగా తామే హత్య చేసినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు.

వైద్యం వికటించి యువకుడి మృతి


అహ్మద్ ఇర్ఫానుద్దీన్ (ఫైల్)

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 13: వైద్యం వికటించి యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి తల్లిదండ్రులు ఎండీ అహ్మద్‌గయాసుద్దీన్ పటేల్, ఖమర్‌జహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాజిద్‌పురకు చెందిన అహ్మద్ ఇర్ఫానుద్దీన్ పటేల్ (28) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించగా, శస్త్రచికిత్స తప్పనిసరిగా చేసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో అహ్మద్ ఇర్ఫానుద్దీన్ పటేల్ ఈ నెల 11న నమాజ్ చేసిన తర్వాత నడుచుకుంటూ సదరు ఆసుపత్రికి వెళ్లి అడ్మిట్ అయ్యాడు. అతన్ని వైద్యులు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన కొద్దిసేపటి తర్వాత, బీపీ తగ్గిందని, హుటాహుటిన హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందాడు. అనుమానం వచ్చిన కుటుంబీకులు సిద్దిపేటలోని వైద్యులను సంప్రదించగా అపెండెక్స్ ఆపరేషన్ చేయలేదని, చేశామని ఒక్కో సారి ఒక్కోతీరుగా సమాధానం చెప్పడం తో తల్లిదండ్రులు వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ తప్పిదం వల్లే తమ కొడుకు చనిపోయాడని ఆరోపించారు. ఆసుపత్రి వైద్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతునికి రెండేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం 14 నెలలు బాబు ఉన్నాడు.

ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఫ్యాను, సామాను

నారాయణఖేడ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన నారాయణఖేడ్ మండలంలోని అబ్బెందలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన నెర్గల్ శివరాములు ఇంట్లో శనివారం రాత్రి విద్యుదాఘాతం ఏర్పడి మంటలు చెలరేగాయి. ఇంట్లోని 2 క్వింటాళ్ల బియ్యం, 2 క్వింటాళ్ల జొన్నలు, రూ.2.76 లక్షల నగదు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి.

బోడ్మాట్‌పల్లిలో పాడి గేదె..

టేక్మాల్, జూలై 13(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన సంఘటన టేక్మాల్ మండలంలోని బోడ్మాట్‌పల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన ముద్దపురం నాగప్పకు చెందిన గేదె మేతకోసం గ్రామ శివారులోకి వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

చేగుంట జూలై 13 (ఆంధ్రజ్యోతి): పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వైరు సరిచేస్తుండగా విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాలలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన రైతు మురాడి చిత్తం (54)కు గ్రామ శివారులోని పొలం ఉంది. ఆదివారం తన పొలం వద్ద బోరు మోటార్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడంతో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు వైరు వేస్తుండగా పైన ఉన్న 11కేవీ లైన్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్‌ఐ చైతన్య కుమార్ రెడ్డి వెల్లడించారు.

మల్యాలలో..

సిద్దిపేట రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండలం మల్యాలకు చెందిన మేడికాయల పోచయ్య(65) శనివారం మధ్యాహ్నం తన పొలం వద్ద వరి నారుమడికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. స్టార్టర్‌కు విద్యుత్ సరాఫరా కాకపోవడంతో దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలించగా ఫ్యూజ్ వైరు పోయిందని గుర్తించాడు. మరమ్మత్తు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్ కొట్టి తీవ్రగాయాలై కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కోడుకు ఉన్నారు. జరిగిన సంఘటనపై మృతుని కోడుకు మేడికాయల శ్రీనివాస్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నకోడురు పోలీసులు తెలిపారు.


మురాడి చిత్తం, మేడికాయల పోచయ్య మృతదేహాలు

హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో జీజీహెచ్ వైద్యాధికారులు

● మెడికల్ అడ్మినిస్ట్రేటర్స్ ట్రైనింగ్ పూర్తి

సంగారెడ్డి అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో జరిగిన హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, అనుబంధ బోధనాస్పత్రి వైద్యాధికారులు పాల్గొన్నారు. కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఐఎస్‌బీ సహకారంతో గతేడాది ఆగస్టు నెల నుంచి మొదలుకుని ప్రతి నెలా ఒకట్రెండు రోజుల పాటు మెడికల్ అడ్మినిస్ట్రేటర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఇందులో సంగారెడ్డి జీజీహెచ్ జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ జి.అనిల్‌కుమార్, ప్రభుత్వ మెడికల్ కాలేజీకి చెందిన మైక్రోబయోలజీ హెచ్‌వోడీ డాక్టర్ సుధామాధురితో పాటు జీజీహెచ్ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సందీప్ ఐఎస్‌బీ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ సారంగ్‌డియో చేతుల మీదుగా శిక్షణ పూర్తి చేసుకున్న సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఏడాది కాలం పాటు దశల వారీగా పొందిన శిక్షణ వైద్య సేవలు, పరిపాలనపరంగా ఎంతగానో ఉపయోగపడనుందని ఆయా వైద్యాధికారులు తెలిపారు.


ఐఎస్‌బీ ప్రొఫెసర్ సారంగ్‌డియో నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న అనిల్‌కుమార్

ఏడుపాయల, కొమురవెల్లికి పోటెత్తిన భక్తులు

పాపన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వనదుర్గా ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆషాఢమాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ఏడుపాయలలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు బోనాలు సమర్పించారు. మరికొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులు కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

మల్లన్న ఆలయంలో..

చేర్యాల : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నాన మాచరించారు. భక్తిప్రపత్తులతో బోనంనివేదించి చెలక, నజరు, ముఖ మండప పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాక పెట్టి బోనం నివేదించారు. తమ కోర్కెలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల పండగ సందర్భంగా జంటనగరాల భక్తులు రాకపోవడంతో కాస్త ప్రభావితం చూపింది.

భక్తుల సమస్యలు పరిష్కరిస్తాం

జగదేవ్‌పూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ ఆలయాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తూ భక్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ అనుగీత అన్నారు. ఆదివారం కొండపోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో డైరెక్టర్‌లు వెంకట్‌రాంరెడ్డి, నర్సింలు, రాజు, నరేష్‌లతో కలిసి ఆలయాభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండపోచమ్మ ఆలయం వద్ద ప్రధాన సమస్యలను గుర్తించినట్లు చెప్పారు. తాగునీటి సమస్య, మహిళా భక్తులకు సౌకర్యాలు, పారిశుధ్యం, అతిథుల కోసం గెస్ట్‌హౌజ్ నిర్మాణం అవసరమని గుర్తించామని తెలిపారు. ఆలయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.


ప్రత్యేక అలంకరణలో వనదుర్గామాత


మాట్లాడుతున్న కొండపోచమ్మ ఆలయ చైర్‌పర్సన్ అనుగీత


కొమురవెల్లి ఆలయ రాజగోపుర ఆవరణలో భక్తుల రద్దీ

అసభ్యంగా దూషిస్తున్నారు..
న్యాయం చేయండి

● సంగారెడ్డి కలెక్టర్‌ను కోరిన పారిశుధ్య కార్మికులు

సంగారెడ్డి క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అకారణంగా తమను పదే పదే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఓ మహిళా అధికారిపై మహిళా పారిశుధ్య కార్మికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి జిల్లాలోని ఓ మహిళా ఉన్నతాధికారి కొన్నిరోజులుగా తమను అకారణంగా నోటికొచ్చినట్లు అసభ్య పదజాలంతో తిడుతున్నారని అధికారి కార్యాలయం వద్ద, ఇంట్లో పనిచేసే మహిళా పారిశుధ్య కార్మికులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ దాదాపు 20 మంది కార్మికులు కలెక్టర్ పి.ప్రావీణ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ గౌరవ మర్యాదలు కాపాడమని కోరారు. కార్మికులమైనంత మాత్రాన నోటికొచ్చినట్లు తిడితే పడాలా అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒగ్గు, పంబాల కళాకారులకు నంది అవార్డుల ప్రదానం



రాగుల సారయ్యకు నంది అవార్డు అందించి సన్మానిస్తున్న సాహితీ వేదిక నిర్వాహకులు



జాజాల బాలయ్య

మద్దూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు గ్రామానికి చెందిన ప్రముఖ ఒగ్గు కళాకారుడు రాగుల సారయ్య, పంబాల కళాకారుడు జాజాల బాలయ్యలకు ప్రతిష్టాత్మక నంది అవార్డులు, ప్రశంసా పత్రాలు లభించాయి. తెలుగు కళారంగంలో వారు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు దక్కాయి. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి జరిగిన నందమూరి తారక రామారావు, పి.వి. నరసింహారావు జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నంది అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. దైవజ్ఞ శర్మ (గౌరవ అధ్యక్షులు, తెలుగు వెలుగు సాహితీ వేదిక), వంగాల శాంతి కృష్ణ ఆచార్య (తెలుగు వెలుగు సాహితీ వేదిక పినపల్లి ఛైర్మన్), డాక్టర్ వలబోజు మోహన్‌రావు (జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలుగు వెలుగు సాహితీ వేదిక), భాస్కర్ రావు (జాతీయ అధ్యక్షులు, తెలుగు వెలుగు) చేతుల మీదుగా రాగుల సారయ్య, జాజాల బాలయ్య ఈ అవార్డులను అందుకున్నారు.

16న వాహన వేలం

మద్దూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): చేర్యాల ఎక్సైజ్ శాఖ పట్టుబడిన ఒక టాటా ఇండికా వాహనానికి ఈ నెల 16న వేలం పాట నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని పేర్కొన్నారు. వాహనం కనీస ధర రూ.25 వేలుగా నిర్ణయించగా, వేలంలో పాల్గొనేందుకు రూ.6,250 (25 శాతం) నగదు డిపాజిట్ చేయాలని తెలిపారు. వేలంలో అధిక ధరకు వాహనాన్ని దక్కించుకున్న వారు 18 శాతం జీఎస్టీ చెల్లించాలని పేర్కొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మైసయ్య (ఫైల్)

వెల్దుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులు తాళలేక మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన క్యాత్రాల మైసయ్య (52) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైసయ్యకు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. గత సంవత్సరం కూతురికి వివాహం చేయడంతో అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. హైదరాబాద్‌లోని అల్వాల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మైసయ్య, శనివారం మధ్యాహ్నం తన భార్య, కుమారుడు బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కింటి వారు చూసి మైసయ్య కుమారుడికి సమాచారం అందించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య బాలమ్మ ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తవ్వుకునోళ్లకు తవ్వుకున్నంత..



- మనోహరాబాద్, అక్కన్నపేట మండలాల్లో జోరుగా అక్రమ తవ్వకాలు
- అనుమతి గోరంత.. తవ్వేది కొండంత
- రూ.కోట్లు కొల్లగొడుతున్న అక్రమార్కులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మనోహరాబాద్, అక్కన్నపేట మండలాల్లో మట్టి, ఇసుక అక్రమ దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అక్రమార్కులు అనుమతుల ముసుగులో కోట్ల రూపాయల కొల్లగొడుతున్నారు. కొంత అనుమతి తీసుకుని.. తవ్వకాలు మాత్రం అంతటా జరుపుతూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ మాఫియాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం చూసీ చూడనట్టు వదిలేయడమే కాకుండా, 'మామూళ'తో చేతులు కలిపి పరోక్షంగా సహకరిస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



లింగారెడ్డిపేట్ శివారులో ఎక్స్‌కవేటర్‌తో కొండను తవ్వి లారీలో నింపుతున్న మట్టి

మనోహరాబాద్/అక్కన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మట్టి, ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. నూతనంగా నిర్మిస్తున్న అనేక పరిశ్రమలను ఆసరాగా చేసుకుని, మట్టి మాఫియా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నది. మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట గ్రామ శివారులో ఓ కాంగ్రెస్ నాయకుడు, ప్రజాప్రతినిధి మెదక్ జిల్లా మైనింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకున్నాడు. ఇదే అదునుగా గ్రామ రైతు పొలం గుట్టకు అనుమతి ఉందని చెప్పి, గత నెల రోజులకు పైగా అక్రమంగావేల ట్రిప్పుల మట్టిని పరిశ్రమలకు తరలిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి మాఫియా మండల, జిల్లా అధికారులను చేతిలో పెట్టుకుని, ముడుపులు చెల్లిస్తూ పెద్ద ఎత్తున మట్టిని పరిశ్రమలకు తరలిస్తూ కోట్ల రూపాయలు పోగేసుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు కాంగ్రెస్ నాయకుడు నేనే రాజు, నేనే మంత్రి అన్న విధంగా మట్టి దందాను నడిపిస్తున్నాడు. అనుమతి తీసుకున్న మేరకే మట్టిని తవ్వేలా జిల్లా కలెక్టర్ మట్టి మాఫియాపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా మైనింగ్ శాఖ అధికారి విజయ్‌కుమార్ రాథోడ్‌ను వివరణ కోరగా అనుమతి ఇచ్చింది నిజమే, కానీ ఎంత మేరకు మట్టి తరలింపు చేస్తున్నారని త్వరలో తనిఖీలు చేస్తామని తెలిపారు.

అక్కన్నపేటలో ఇసుక దందా..

ఇక అక్కన్నపేట మండలంలో గత కొన్ని రోజులుగా జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్యులు తమ ఇంటి నిర్మాణ పనులకు తట్ట ఇసుక ముట్టనివ్వరు కానీ, అక్రమార్కులు ట్రిప్పులకొద్ది ఇసుక రవాణా చేస్తున్నా అటు వైపు కన్నెత్తి చూడడం లేదని మండిపడుతున్నారు. మండలంలోని అక్కన్నపేట, జనగామ, గౌరవెల్లి వాగుల నుంచి



అక్కన్నపేట వాగులో నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలింపు

గత కొన్ని రోజుల నుంచి ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కొందరు అధికార పార్టీ నేతలు అభివృద్ధి పనుల పేరిట అనుమతులు తీసుకుంటే, ఇదే అదనుగా భావించి వందలాది ట్రిప్పుల ఇసుకను అక్రమంగా ఒక్కో ట్రిప్ ట్రాక్టర్ ఇసుకకు రూ. 5 వేల చొప్పున అమ్ముకుంటున్నారని వాపోతున్నారు ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక మాఫియా అందినకాడికి దోచుకుంటున్నది ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి పనులకంటూ..

పలు అభివృద్ధి పనుల కోసం ఇసుకను తరలిస్తున్నామని తప్పుడు కాగితాలు చూపిస్తూ అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, యువకులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా వారి నుంచి పూర్తిస్థాయిలో స్పందన లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒకవేళ వచ్చినా, ముందుగానే ఇసుక రవాణాదారులకు సమాచారం అందించి ట్రాక్టర్లు వెళ్లిపోయిన తర్వాత వస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాదారులను స్థానికులు అడ్డుకుని ప్రశ్నిస్తే, అధికారులకు ఏమి కావాలో నెల నెలా సమకూర్చుతున్నామని.. తమను ఎవరూ పట్టుకోరని వారు బహిరంగంగానే చెప్పడం గమనార్హం.

అభయహస్తం ఎవరికో?

(5వ పేజీ తరువాయి)

కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇక్కడ మూడు గ్రూపులు తయారయ్యాయి. ఇక సిద్దిపేట నియోజకవర్గంలో ఇన్‌చార్జి పూజల హరికృష్ణకు ఇతర నేతల మధ్య దూరం పెరుగుతున్నది. ఆయనను ఇతర నేతలు బాహాటంగా విమర్శిస్తున్నారు. తమకు పదవుల్లో న్యాయం చేయాలని అటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, సురేఖ, దామోదర్‌తోపాటు సీనియర్ నేతలు జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంతరావును సిద్దిపేట నేతలు ఆశ్రయిస్తున్నారు. దుబ్బాకలోనూ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నేత శ్రావణ్‌కుమార్‌రెడ్డి మధ్య పార్టీలో అంతర్గత పోరు ఉందనే చర్చ జరుగుతోంది. అదేవిధంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడుగా చీలిపోయింది. ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన కాటా శ్రీనివా‌స్‌గౌడ్ ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎంపీగా ఓటమిపాలైన నీలం మధు ఇదే నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతగా తిరుగుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన మహిపాల్‌రెడ్డి సైతం తనదైన పాత్ర పోషిస్తున్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోనూ అప్పుడప్పుడు విభేదాలు తెరమీదకొస్తున్నాయి.

పదవుల చిక్కుముడి వీడేనా..

నేడు గాంధీభవన్‌లో పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖిగా మాట్లాడతారు. బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడంతో ఇంటర్వ్యూ అనివార్యమైంది. పదుల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను వడబోసి నాలుగైదు చొప్పున ఎంపిక చేశారు. వీరిని ఇంటర్వ్యూకు ఆహ్వానించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 66 మండలాలు, 15 బ్లాకులు, 21 పట్టణాలు ఉన్నాయి. వీటన్నింటికీ కాంగ్రెస్ పార్టీ తరపున అధ్యక్షులను ఎంపిక చేయాల్సి ఉంది. ఈనెల 15వ తేదీ వరకే సంస్థాగతంగా ఎంపిక పూర్తి చేయాలని టీపీసీసీ ఆదేశించింది. ఈ లెక్కన నేడు, రేపటిలోగా పదవుల్లో కొత్త నేతలు ఆశీనులు కాకతప్పదు. గ్రూపు రాజకీయాల నేపథ్యంలో ఈ పదవుల చిక్కుముడి వీడుతుందా.. పెండింగులో పడుతుందా అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది.

పొన్నం సమర్థతే కీలకం

పదవుల ఎంపిక ప్రక్రియ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాల్‌గా మారనున్నది. పీసీసీ తరఫున ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా ఆయనను ఎంపిక చేయడం వ్యూహాత్మకమేనన్నట్లుగా తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయగలరనే ధీమాతోనే మెతుకుసీమ పార్టీ పగ్గాలను ఆయనకు అప్పగించింది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గం సిద్దిపేట జిల్లాలోనే ఉంది. సిద్దిపేట జిల్లా మంత్రిగానూ ఆయన సేవలందిస్తున్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలపై అవగాహన లేకపోలేదు. బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో కాంగ్రెస్‌ను పటిష్ఠం చేయడానికే పొన్నంను రంగంలోకి దింపింది. మెదక్ పార్లమెంటు స్థానంతోపాటు రెండు ఎమ్మెల్సీలను కైవసం చేసుకొని బీజేపీ కూడా బలపడింది. అందుకే సరైన కార్యకర్తలకు పదవులు కట్టబెట్టడానికి అనుభవంతోపాటు సమర్థుడిగా పేరున్న పొన్నం ప్రభాకర్‌కు కీలక బాధ్యతలు ఇచ్చారు. రెండు రోజుల్లోనే వందకుపైగా ఉన్న పదవుల లెక్క తేల్చాల్సి ఉంది. పార్టీలో సిన్సియర్లకు అవకాశం కల్పిస్తారా.. సీనియర్లకు పదవులు కట్టబెడతారో వేచిచూడాలి.



ఆపదలో ఆదుకునే
ఎన్‌ఎఫ్‌బీఎస్

- కుటుంబ పెద్ద చనిపోతే రూ. 20 వేల సాయం పొందే వీలు
- ప్రజల్లో అవగాహన లోపంతో వినియోగించుకోని వైనం
- అధికారులూ మిన్నకుండిపోవడంతో నిరుపయోగంగా మారిన పథకం

రామాయంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబ పెద్ద మరణిస్తే రూ.20వేల తక్షణ ఆర్థిక సహాయం అందించే 'జాతీయ కుటుంబ ప్రయోజన పథకం' (ఎన్‌ఎఫ్‌బీఎస్) రామాయంపేట మండలంలో ఆదరణ కోల్పోయింది. అధికారుల అవగాహన లోపమో, ప్రజల నిర్లక్ష్యమో తెలియదు కానీ, గత రెండేళ్లుగా ఈ పథకానికి ఒక్క దరఖాస్తు కూడా నమోదు కాకపోవడం ఆశ్చర్యకరం. దీంతో ఈ పథకం గురించి ప్రజలకు పెద్దగా అవగాహన లేదని స్పష్టమవుతోంది. ప్రతి సంవత్సరం ఎంతో మంది నిరుపేద కుటుంబ పెద్దలు ప్రమాదాలు లేదా అనారోగ్యాల కారణంగా మరణిస్తున్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదు. వితంతు పింఛన్ల కోసం వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, మరణించిన కుటుంబ పెద్ద పేరున వచ్చే ఈ ఆర్థిక సహాయాన్ని ప్రజలు కోరకపోవడం అధికారుల ప్రచార లోపాన్ని స్పష్టం చేస్తోంది. గతంలో ఈ పథకానికి సంబంధించి అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉండేవని, కానీ గత రెండేళ్లలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని తెలుస్తోంది. ఈ విషయమై తహసీల్దార్ రజనీ కుమారి అభిప్రాయం కోరగా.. తాను ఇక్కడికి వచ్చిన రెండేళ్ల నుంచి ఈ పథకానికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదని తెలిపారు. నిరుపేద కుటుంబంలోని యజమాని ఏ పరిస్థితుల్లో మరణించినా రూ.20 వేల ఆర్థిక సహాయం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

ఈ పథకం ఎవరికంటే..

- మరణించిన కుటుంబ పెద్ద వయస్సు 18 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండాలి.
- కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు ఉండాలి.
- వ్యక్తి మరణించిన నాటి నుంచి మూడేళ్ల లోపు తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.
- కుటుంబ పెద్ద బతికి ఉన్న సమయంలో ఎలాంటి ప్రభుత్వ లబ్ధి (ప్రభుత్వ బీమా వంటివి) పొంది ఉండకూడదు.



యాజమాన్యం నిర్లక్ష్యమే
ప్రమాదానికి కారణం

- సిగాచి బాధితులకు న్యాయం చేయాలి
- తెలంగాణ పౌర సమాజ నిజనిర్ధారణ బృందం



బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న పౌర సమాజ నిజనిర్ధారణ బృందం

పటాన్‌చెరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పాశమైలారంలోని సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన భారీ పేలుడు సంఘటనపై తెలంగాణ పౌర సమాజ నిజనిర్ధారణ బృందం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కలపాల బాబూరావు నేతృత్వంలోని బృందం ఆదివారం సిగాచి ఫార్మా పరిశ్రమను సందర్శించింది. బాధితుల కుటుంబ సభ్యులు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు, ప్రమాదం నుంచి బయటపడిన వారు, అధికారులు, స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించింది. ఈ పేలుడుకు ప్రధాన కారణం యాజమాన్యం యొక్క దీర్ఘకాలిక నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాలను గాలికొదిలేయడమేనని స్పష్టం చేసింది. ఈ ఘటనలో మరణించిన, గాయపడిన కార్మికుల వాస్తవ సంఖ్య, వివరాలను ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని, బాధితుల కుటుంబాలకు ప్రకటించిన పరిహారం వెంటనే చెల్లించాలని, పరిశ్రమ యాజమాన్యంపై హత్యా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. గతంలో పరవాడలోని సినర్జీన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్‌లో జరిగిన ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఇంకా బయటకు రాకపోవడం పట్ల కూడా బృందం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సిగాచిలో పేలుడుకు అనువైన పరిస్థితులు ఎలా ఏర్పడ్డాయి, మళ్లీ జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి అనే విషయాలపై నిపుణులు విశ్లేషించి తగిన సిఫారసులు చేయాలని బృందం తెలిపింది. ఈ బృందంలో రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది వసుధా నాగరాజు, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ కన్నెగంటి రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకటరెడ్డి, అశోక్ కుమార్, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఉస్మాన్, నాయకులు మజీద్ , ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక రాష్ట్ర కన్వీనర్ మీరా సంఘ మిత్ర, నాయకులు అఖిల్ సూర్య , సంగారెడ్డి జిల్లా టీపీజేఏసీ నాయకులు జనార్దన్, కందిలి పత్రిక సంపాదకులు రాజేందర్ తదితరులు ఉన్నారు.

బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

● పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): యాజమాన్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే సిగాచి పరిశ్రమలో 52మంది కార్మికులు బలయ్యారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. ఘటనకు కారణమైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జిల్లా కార్మిక అధికారి రవీందర్‌రెడ్డిని కోరారు. లాభాల అత్యాశకు పోయి కార్మికుల బద్రతను గాలికి వదిలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కాంట్రాక్టర్లు సైతం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని విమర్శించారు. తీవ్రంగా గాయపడిన మరో 30 మంది కార్మికుల భవిష్యత్తు కూడా ఆందోళనకరంగా మారిందన్నారు. పరిశ్రమ డైరెక్టర్లు, కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నవ్య కాలనీలో మిషన్ భగీరథ కనెక్షన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.

పాశమైలారంలో భారీ అగ్ని ప్రమాదం

- ట్యాంకర్ నుంచి వ్యర్థాలు అన్‌లోడ్ చేస్తుండగా మంటలు
- ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో ఘటన

పటాన్‌చెరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన మరువకముందే.. ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్ అనే పరిశ్రమలో భారీ ప్రమాదం చోటు చేసుకున్నది. పరిశ్రమ లోపల ట్యాంకర్ నుంచి అన్‌లోడ్ చేస్తుండగా.. ట్యాంకర్ వెనక నుంచి అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బందితో పాటు డ్రైవర్ సహా ట్యాంకర్‌లో ఉన్న ఐదుగురు బయటకు పరుగులు తీయడంలో ప్రమాదం తప్పింది. ఘటన విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఐదు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే అక్కడే ఉన్న లారీ, ఎక్స్‌కవేటర్ మంటలకు దగ్ధమయ్యాయి. ప్రమాదానికి కారణం షార్ట్‌సర్క్యూట్ అని యాజమాన్యం చెబుతోంది. వివిధ పరిశ్రమలకు చెందిన వ్యర్థ జలాలు, పదార్థాలను ఇక్కడ రీ ప్రాసెస్ చేసే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. అదృష్టవశాత్తు ఎవరూ గాయపడకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సిగాచి ఘటన మరువని అగ్నిమాపక శాఖ కూడా ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఐదు ఫైరింజన్లను రంగంలోకి దింపడం గమనార్హం.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

న్యూస్ బాక్స్

పాశుపత యాగానికి రావాలని ఎంపీకి ఆహ్వానం



ఎంపీ సురేష్‌షెట్కార్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న అర్చక సంఘ బాధ్యులు

నారాయణఖేడ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ కాచిగూడలోని శ్రీతుల్జాభవన్ ధర్మశాలలో సోమవారం నుంచి 16వ తేదీవరకు నిర్వహించనున్న పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపతయాగ కార్యక్రమానికి రావాలని అర్చక సంఘం బాధ్యులు ఎంపీ సురేష్‌షెట్కార్‌ను కోరారు. ఆదివారం ఖేడ్‌లోని ఎంపీ నివాసంలో ఆహ్వానపత్రికను అందజేశారు.

ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్ల కౌన్సెలింగ్‌ను ప్రారంభించాలి

మాసాయిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లావ్యాప్తంగా మల్టీ జోనల్ ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్ల కౌన్సెలింగ్‌ను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ఫోరం ఫర్ టీచర్స్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 800 మంది ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

కోట శ్రీనివాస్‌రావుకు ఘన నివాళి



రావి ఆకుపై శివకుమార్ మలచిన కోట శ్రీనివాస్‌రావు చిత్రం

నారాయణఖేడ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వైవిధ్య భరితమైన పాత్రలతో సినీ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న ప్రముఖ వైవిధ్య నటుడు కోట శ్రీనివాస్‌రావు మరణం బాధాకరమని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం కోట శ్రీనివాస్‌రావు చిత్రాన్ని రావి ఆకుపై మలచి నివాళులర్పించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్

చిలప్‌చెడ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు ఎరువుల కొరత లేదని, సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం చిలప్‌చెడ్ మండలంలోని వివిధ ఫర్టిలైజర్ షాపులను సందర్శించి మాట్లాడారు. మండలంలో 70 మెట్రిక్ టన్నుల యూరియా, 10 మెట్రిక్ టన్నుల డీఏపీ, 83 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో ఎలాంటి ఎరువుల కొరత లేదని తెలిపారు. ఆయన వెంట ఎరువుల దుకాణాల యజమానులు తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఎరువులు అమ్మకం

- పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్

నర్సాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ సాగుకు అవసరమయ్యే యూరియా, కాంప్లెక్స్ ఎరువులు విక్రయిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో పీఏసీఎస్ సీఈవో వెంకటస్వామితో కలిసి మాట్లాడారు. రైతులు తమకు అవసరమున్న కాంప్లెక్స్ ఎరువులు, యూరియా కోసం నర్సాపూర్-వెల్దుర్తి మార్గంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటుందని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కాంప్లెక్స్ ఎరువులు బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే పీఏసీఎస్ అందిస్తుందన్నారు.

సౌండ్ సిస్టమ్ బహూకరణ

మద్దూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన రామిని వీరేశం రూ. 20 వేల విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు రామిని వీరేశానికి పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

రహదారుల అభివృద్ధికి రూ.250 కోట్లు

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్/సిర్గాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రహదారుల అభివృద్ధి కోసం నారాయణఖేడ్ నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించిందని ఎమ్మెల్యే పీ.సంజీవరెడ్డి తెలిపారు. సిర్గాపూర్ మండల పరిధిలోని గోసాయిపల్లికి నిర్మిస్తున్న బీటీ రహదారి పనులను, అంతర్గాం గ్రామ సమీపంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. అనంతరం నల్లవాగు ప్రాజెక్టు అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. కల్హేర్ మండలంలోని మాసాన్‌పల్లి చౌరస్తా నుంచి కల్హేర్ మీదుగా సిర్గాపూర్ వరకు, నారాయణఖేడ్ నుంచి కరస్‌గుత్తి వరకు, నారాయణఖేడ్ నుంచి రాయిపల్లి వరకు, పెద్ద శంకరంపేట నుంచి వయా హన్మంత్‌రావ్ మీదుగా వెంకటపూర్ చౌరస్తా వరకు ఆర్‌అండ్‌బీ హ్యామ్ పథకం కింద రహదారులు మంజూరైనట్లు తెలిపారు. జల్ జీవన్ పథకం కింద ఎంపీ సురేష్‌షెట్కార్ సహకారంతో బోరంచ దగ్గర మంజీరానది నుంచి తాటిపల్లి గ్రామ సమీపంలో సంప్ నిర్మించి నారాయణఖేడ్ పట్టణానికి ప్రత్యేకంగా పైప్‌లైన్ ద్వారా మంచినీటి అవసరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కామారెడ్డి జిల్లా కౌలాస్ ప్రాజెక్టు వద్ద ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేసి పైప్ లైన్ ద్వారా కంగ్టి మండలంలోని బోర్గి, చౌకన్‌పల్లి, దెగుల్‌వాడి, కంగ్టి, జీర్గితండా, ఎడ్లర్యాగడితండాలకు మంచి నీరు అందించే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, పండరిరెడ్డి, శ్రీనివాస్‌రావ్, రవి పటేల్, జయరాజ్, విటల్, పురుషోత్తం, క్రిష్ణ, నరేందర్, మలహరి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఖానాపూర్(కే) అలిఖాన్‌పల్లితండాకు చెందిన లక్ష్మికి, సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామానికి చెందిన ఉషాబాయికి ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి శ్రేయారెడ్డి, కల్హేర్ మాజీ జడ్పీటీసీలు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



సిర్గాపూర్ మండలం గోసాయిపల్లికి నిర్మిస్తున్న బీటీ రహదారి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

బీసీ రిజర్వేషన్ అంటూ కాంగ్రెస్ కొత్త నాటకం

- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



జోగిపేటలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

జోగిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల ముందు రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ అంటూ కొత్త నాటకానికి తెర తీసిందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆదివారం ఆయన జోగిపేటలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా.. అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రశ్నించే వరకూ బీసీ రిజర్వేషన్లపై ఈ ప్రభుత్వానికి కనీస సోయి లేదన్నారు. ఓవైపు 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండగా.. గవర్నర్ నుంచి ఆర్డినెన్స్ సాధ్యం కాదని ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసినా.. కేవలం ఎన్నికల వేళ బీసీలను మభ్యపెట్టేందుకే ఈ పన్నాగం పన్నుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డీబీ.నాగభూషణం, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు హెచ్.రామాగౌడ్, తాలెల్మ ఎత్తిపోతల పథకం చైర్మన్ లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘స్థానికం’లో 42 శాతం రిజర్వేషన్లు బీసీల హక్కు

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుగౌడ్

సంగారెడ్డి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనేది బీసీల హక్కు అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్ అన్నారు. సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షించదగిన విషయమన్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను కుదించిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం శుభపరిణామమని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి జీ.కృష్ణ, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌పాటిల్, ముఖ్య సలహాదారుడు చంద్రయ్య స్వామి, జిల్లా కార్యదర్శి సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

- తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

వట్‌పల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఆర్డినెన్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీసీలను వంచించే ప్రయత్నం చేస్తోందని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి ఆరోపించారు. ఆదివారం వట్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్, బీసీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసే సమయంలో బీఆర్ఎస్ సైతం మద్దతు ఇచ్చిందని, ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపామని రేవంత్ సర్కార్ మళ్లీ ఆర్డినెన్స్ ఇవ్వడంలో మతలబేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు మధు, శ్రీనివాస్‌గౌడ్, అప్పారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రకాశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం లాంటిది

- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్స్ అందిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానం లాంటిదని జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. ఆదివారం కోహీర్ మున్సిపల్ పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో ఇండియన్ స్కూల్ వారు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. తలసేమియా వ్యాధితో బాధపడే వారికి రక్తదానం ఎంతగానో అవసరం పడుతుందన్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఇండియన్ స్కూల్ యజమాని మున్నావర్‌ను, వైద్య బృందాన్ని, రక్తదానం చేసిన వారిని అభినందించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలీం, ప్రసాద్‌రెడ్డి, షౌకత్‌అలీ, నర్సింలు, నామ రవికిరణ్, ఎస్కే జావిద్, సావుద్ స్కూలు యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం



పాటిలో కల్వర్టు ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రవాణా వ్యవస్థలను బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన కల్వర్టును ఆదివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని గ్రామాల్లోని కాలువల మీదుగా కల్వర్టుల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఎన్నిక

పెద్దశంకరంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సంఘం పెద్దశంకరంపేట పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుకూరి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా చకిలం సంతోష్‌కుమార్, కోశాధికారిగా దడిగారి గంగాధర్, ఉపాధ్యక్షులుగా రాగం సిద్ధేశ్వర్, గడ్డం మల్లేశం, సహాయ కార్యదర్శిగా మద్దికుంట రమేష్, పాపిశెట్టి సంతోష్, దాదిగారి నరేష్, సహాయ కోశాధికారులుగా రాగం శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అందరినీ సంఘటితం చేసేందుకు కృషి

- బాలీవుడ్ నటుడు గగన్ మాలిక్

జహీరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : అందరిని సంఘటితం చేసే ఉద్దేశంతో మహారాష్ట్రలోని గుల్బర్గ నుంచి తెలంగాణలోని హైదరాబాద్‌లో గల బుద్ధభవనం వరకు పాదయాత్ర చేపట్టడం జరుగుతుందని బాలీవుడ్ నటుడు గగన్ మాలిక్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బుద్ధిజంపై సభలు, సమావేశాలు నిర్వహించి అందరినీ ఏకతాటిపై తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. నవంబరు-డిసెంబరులో మహారాష్ట్రలోని బుద్ధవిహార్ నుంచి తెలంగాణలోని బుద్ధభవనం వరకు పెద్దసంఖ్యలో పాదయాత్రను చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సమయంలో అందరినీ సంఘటితం చేసేందుకు అక్కడ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను గత 11 ఏళ్లుగా బుద్ధిజంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు వివిధ సినిమాల్లో, సీరియళ్లలో నటించి ప్రేక్షకుల ఆదరణను పొందుతున్నామని ఆయన చెప్పారు.

పత్తి సాగు వైపు రైతుల మొగ్గు

- ఈ యేడు పెరిగిన పత్తి విస్తీర్ణం
- మద్దతు ధర పెరగడంతో రైతుల ఆసక్తి



మాచునూర్ గ్రామ శివారులో సాగవుతున్న పత్తి పంట

ఝరాసంగం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పత్తి సాగువైపు రైతులు ఆసక్తి కనబర్చుతున్నారు. మార్కెట్‌లో పత్తికి మంచి డిమాండ్ ఉంది. కేంద్ర ప్రభుత్వం 2025-26 ఖరీఫ్ సీజన్‌కుగాను కనీస మద్దతు ధర పత్తికి క్వింటాల్‌కు రూ.589 ప్రకటించింది. దీంతో పత్తి క్వింటాళ్ల ధర రూ.8,110 కావడంతో గతేడాది కంటే ఈసారి పత్తి పంట విస్తర్ణం గణనీయంగా పెరిగింది. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలో నల్లరేగడి భూములు అధికంగా ఉండడం వల్ల రైతులు పత్తి పంటను సాగు చేశారు. గతేడాది మండలంలో సుమారు 25 వేల ఎకరాల్లో పత్తి సాగైనట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం సుమారు 28,156 ఎకరాల్లో పత్తి పంట సాగవుతున్నట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

28 వేల ఎకరాల్లో సాగు

మండలవ్యాప్తంగా సుమారు 28 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. విత్తనాల సాగు పూర్తికాగానే రైతులవారీగా.. సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని అధికారులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం రైతులు ఎద్దుల సహాయంతో పంటకు అడుగు మందులు వేస్తున్నారు. మరికొంత మంది రైతులు చీడపీడల నివారణకు రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు.

ఘనంగా బోనాలు

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఆదివారం ఆషాఢమాస బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలైన పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, ఉరడమ్మకు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



జహీరాబాద్: గడీలో నిర్వహించిన బోనాలలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్



కొండాపూర్ మండలం మల్కాపూర్ ఎల్లమ్మ బోనాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



నర్సాపూర్‌లో రాయరావు చెరువు కట్టపై ఉన్న ఎల్లమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



అల్లాదుర్గంలోని నాంచారమ్మ దేవతకు బోనాలతో ఊరేగిస్తున్న భక్తులు

కళాకారులకు న్యాయం జరిగేలా చూస్తా

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



హనుమంతరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాకారులు

మెదక్, కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులందరికీ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి న్యాయం జరిగేలా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో తెలంగాణ నిరుద్యోగ ఉద్యమ కళాకారులు 12 గంటల పాటల పల్లకి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు భవానీరెడ్డితో కలిసి హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమాన్ని రాజేసింది కళాకారులేనన్నారు. గతంలో కళాకారులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులకు ఉద్యోగం కల్పించేవిధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సారధి సలహాదారుడు నేర్నాల కిషోర్, మెదక్ జిల్లా అధ్యక్షుడు గుడాల సత్యనారాయణ, సంగారెడ్డి శంకర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పులిమామిడిరాజు



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న పులిమామిడిరాజు, నీలం మధు తదితరులు

సదాశివపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు, కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి శనివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించారు. పులిమామిడి రాజు జ్ఞాపికను అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంతో రాజకీయంగా బీసీలకు మంచి అవకాశాలు ఉంటాయని పులిమామిడిరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర సలహాదారులు చొప్పరి శంకర్, నాయకులు బోయిని రమేష్, సంతోష్, సుమన్, పవన్, అనీల్, రమేష్, శ్రీనివాస్, మల్లేష్, తిర్మల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే సదాశివపేట పట్టణంలోని చాపలకేరి మహంకాళీ అమ్మవారి బోనాలలో పులిమామిడిరాజు కుటుంబసభ్యులతో కలిసి పాల్గొని పూజలు చేశారు.

ప్రశాంతంగా టైప్ రైటింగ్ పరీక్షలు

సంగారెడ్డి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం పాలిటెక్నిక్ కళాశాలలో శని, ఆదివారాల్లో నిర్వహించిన లోయర్, హయ్యర్ టైప్ రైటింగ్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు 68 మంది విద్యార్థులు హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ జానకిదేవి తెలిపారు. పరీక్షలను కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి హరీష్‌నంద, వెంకటరెడ్డి, ఇన్విజిలేటర్ శ్రీనివాస్‌గౌడ్, పరీక్షల క్లర్క్ జగదీశ్వర్‌రావులు పర్యవేక్షించారన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి..!



బైపాస్ రోడ్డు విస్తరణలో సూచిక బోర్డులు లేని కారణంగా ప్రమాదకరంగా మారిన పెద్ద గొయ్యి

సంగారెడ్డి క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో రూ.12 కోట్లతో బైపాస్ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా తవ్వుతున్నారు. పెద్ద పెద్ద గోతులు ఏర్పడగా వాటి పక్కన ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా అందులో పడే అవకాశం ఉన్నది. అధికారులు స్పందించి సూచిక బోర్డులు, రేడియం స్టిక్కరింగ్ లైనింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీళ్లు



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

జిన్నారం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం జిన్నారం సమీపంలో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ గేట్‌వాల్ నుంచి నీరు వృథాగా పోతున్నది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామాలకు నీటి సరఫరా సక్రమంగా చేయకుండా.. ఇలా నీటిని వృథాగా వదిలేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



మెదక్ పట్టణంలోని 25, 28వ వార్డు కామునికుంతలో కూలడానికి సిద్ధంగా ఉన్న కల్వర్టు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణంలోని బస్టాండ్ నుంచి కోలిగడ్డ-ఖిల్లా గుట్టకు వెళ్లే రహదారిలో కామునికంత చౌరస్తాలో ఉన్న కల్వర్టు కూలేందుకు సిద్ధంగా ఉన్నది. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. భారీ వర్షాలు కురిస్తే పెను ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికైనా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు కల్వర్టుకు మరమ్మతు కానీ, కొత్తది కానీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.